క్లుప్తంగా

అధికార లాంఛనాలతో కానిస్టేబుల్ మృతదేహానికి అంత్యక్రియలు



కానిస్టేబుల్ తారక రామారావు అంత్యక్రియల్లో పాల్గొన్న పోలీసులు

ఆకివీడు: విజయవాడలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కానిస్టేబుల్ తారక రామారావు మృతదేహానికి గురువారం స్థానిక వెలంపేటలోని శ్మశానవాటికలో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు జరిగాయి. స్థానిక సమతా నగర్ నుంచి మృతదేహాన్ని బంధువులు, స్నేహితులు, అభిమానులతో భారీ ఊరేగింపుగా తీసుకువచ్చారు. అనంతరం విజయవాడ గ్రేహౌండ్స్ పోలీసులు మూడు రౌండులు గాలిలోకి కాల్పులు జరిపిన తరువాత చితికి తండ్రి సింహాచలం నిప్పంటించారు.

కంప్యూటరైజేషన్ నూరుశాతం పూర్తి చేయాలి



కోపల్లె సొసైటీలో సీఈఓతో మాట్లాడుతున్న జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి

కాళ్ల: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల కంప్యూటరైజేషన్ ప్రక్రియను నూరు శాతం నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సూచించారు. కోపల్లెలో సొసైటీని గురువారం జేసీ సందర్శించి కంప్యూటరైజేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ సొసైటీలు కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించి కంప్యూటరైజేషన్ చేయాలని, అందుకు సరిపడా పరికరాలు సిద్ధంగా ఉంచాలన్నారు. సహకార సంఘాలలో రైతుల సభ్యత్వం , రుణాలు, పెట్టుబడి, డిపాజిట్లు, తదితర వివరాలను ఆన్‌లైన్ చేయాలని సూచించారు. కంప్యూటరైజేషన్ ప్రక్రియను సొసైటీ సీఈఓలు పర్యవేక్షించాలన్నారు.

బీఎల్‌వోల ఇంటింటి సర్వే

పెనుగొండ: ఎన్నికల కమిషన్ ఆదేశాలప్రకారం బీఎల్‌వోలు ఇంటింటా సర్వే నిర్వహించి ఓటర్ల జాబితా సవరణ చేయాలని పెనుగొండ తహసీల్దార్ జి.అనితాకుమారి అన్నారు. గురువారం పెనుగొండ తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన బీఎల్‌వోల సమావేశంలో అవగాహన కల్పించారు. మండలంలో 57 మంది బీఎల్‌వోలు ఓటర్ల జాబితాలో చేర్పులు మార్పులు చేయడానికి కృషి చేయాలన్నారు. 01-01-2025 నాటికి 18 ఏళ్లు నిండిన వారి వద్ద దరఖాస్తులు తీసుకొని, ఓటు హక్కు కల్పించాలన్నారు. అదేవిధంగా అనర్హులను జాబి తా నుంచి తొలగించాలన్నారు. సర్వే ప్రక్రియ అక్టోబరు 18వరకూ నిర్వహించడం జరుగుతుందన్నా రు. ప్రతీ ఒక్కరూ బాద్యతతో తప్పులు లేకుండా ఓటర్ల జాబిటా తయారికీ కృషి చేయాలని కోరారు. బీఎల్‌ఓలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

నరసాపురం: ఆర్టీసీ అందిస్తున్న కార్గో సేవలు, రవాణా సేవల్లో సమస్యల పరిష్కారంకోసం శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నరసాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్.సుబ్బన్నరెడ్డి చెప్పారు. డిపో పరిధిలోని నరాపురం, మొగల్తూరు, పాలకొల్లు, యలమంచిలి, పెనుగొండ, ఆచంట చుట్టు పక్కల ప్రాంతాల వారు తమ సమస్యలు, సూచనలు, సలహాలు ఉదయం 11 నుంచి 12 గంటల వరకూ సెల్:99592 25486 నెంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

నరసాపురం రూరల్: ప్రతీ ఒక్కరూ మొక్కలను సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ అన్నారు. ప్లాంట్ ఫర్ మదర్ కార్యక్రమంలో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ప్రధాని నరేంద్రమోడీ చేపట్టిన ప్లాంట్ ఫర్ మదర్ కార్యక్రమంలో భాగంగా ప్రతీ గ్రామ పంచాయతీలోనూ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వీకే వీరభద్రరావు, ఏపీవో శ్రీనివాస్, ఎంఈవో పిల్లి పుష్పరాజ్యం, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

మొగల్తూరు: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని గ్రామ సర్పంచ్ పడవల మేరీ అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఇచ్చిన ప్లాంట్ ఫర్ మదర్ నేచర్ పిలుపు మేరకు గురువారం మొగల్తూరులోని పాలగుంట చెరువు ప్రాంతంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కై లా సుబ్బారావు, వార్డు సభ్యులు ఎల్లమిల్లి మంగ, ఉపాధి హామీ పథకం జేఈ ఆనంద్, టీఏ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు ఛిద్రం.. ప్రయాణం జరభద్రం



చినకాపవరం-రామయ్యగూడెంలో ధ్వంసమైన రహదారి



పాలకోడేరు మండలం మోగల్లులో నీట మునిగిన రహదారి



అధ్వానంగా ఉన్న వేంద్ర పాడిదార్ రోడ్డు

- అధ్వానంగా గ్రామాల్లో రహదారులు
- దుక్కి వర్షానికే జలమయం, ధ్వంసం
- రాకపోకలు సాగించలేక అవస్థలు

ఆకివీడు: గ్రామాల్లో రహదారులు చిన్నపాటి వర్షానికే అధ్వానంగా మారుతున్నాయి. పలు చోట్ల దుక్కి వర్షానికే నీట మునుగుతున్నాయి. పలు ప్రధాన రహదారులు గుంతలుగా మారిపోయాయి. మరికొన్ని రోడ్లు రాకపోకలకు వీల్లేనంతగా ధ్వంసమయ్యాయి. ఆయా గ్రామాల నుంచి మండల కేంద్రాలకు, ఇతర పట్టణాలకు వెళ్లాలంటే ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ద్విచక్రవాహనదారులు ప్రత్యామ్నాయ రహదారుల్ని ఎంచుకుంటున్నారు. ఇతర వాహనచోదకులు గత్యంతరం లేక అదే రహదారిపై రాకపోకలు సాగిస్తూ అవస్థలు పడుతున్నారు.

నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో ఇలా...

నియోజకవర్గంలోని ఉండి మండలంలోని చిలుకూరు-గరగపర్రు, ఉప్పులూరు-యండగండి, ఉణుదుర్రు-పాందువ్వ, పాములపర్రు-పెదకాపవరం, వాంద్రం-కోపల్లె రహదారులు వర్షాలకు ధ్వంసమయ్యాయి. ఆకివీడు మండలంలో చినకాపవరం-రామయ్య గూడెం రహదారి పూర్తిగా అధ్వానంగా మారగా, గోతుల్ని సరిజేసి, రహదారిని తిరగబెట్టారు. దీంతో ద్విచక్ర వాహనాలు వెళ్లే అవకాశం లేకుండా పోయింది. గుమ్ములూరు-అప్పారావు పేట రహదారి పూర్తిగా పాడైపోయింది. పెదకాపవరం-క్రొవ్విడి రహదారిలో రాకపోకలు సాగించడం సాహసమే పలువురు ఎద్దేవా చేస్తున్నారు. కోళ్లపర్రు రహదారి పూర్తిగా ధ్వంసమైయింది. కోళ్ళపరు-రాజులపేట మార్గం అగాథంగా మారింది. కాళ్ల మండలంలోని ప్రధాన రహదారులైన కాళ్ల-కుప్పనపూడి, ఏలూరుపాడు-చెరుకుమిల్లి, వేంపాడు, దొడ్డనపూడి గ్రామాల్లోని రహదారుల ఛిద్రమైపోయాయి. పాలకోడేరు మండలంలోని శృంగవృక్షం-వేంద్ర, పైపుల చెరువురోడ్డులు పాడైపోగా మోగల్లు, కోరుకొల్లు, మైపలోని వడ్డిగూడెం, దళితవాడలోని రహదారులు ధ్వంసమయ్యాయి. భారీ వర్షాలకు రహదారులపై నీరు నిలబడి వాహనాల రాకపోకలకు ధ్వంసమైపోతున్నా చర్యలు తీసుకునే నాథుడులేడని పలువురు వాపోతున్నారు.

దళిత పేటల్లోనూ..

దళిత పేటల్లోని పలు గ్రావెల్, తారు రోడ్లు పాడైపోయాయి. సీసీ రోడ్లకు డ్రెయినేజీ సౌకర్యం లేకపోవడంతో మురుగు నీరు సీసీ రోడ్లపై నిలబడి మురుగు పేరుకుపోవడంతో ప్రజలు జారి పడిపోతున్నారు. డ్రెయినేజీ సౌకర్యం లేని పలు చోట్ల రహదారులు గుంతలుగా తయారయ్యాయని ఆయా ప్రాంతాల్లోని ప్రజలు వాపోతున్నారు.

మామిడి రైతులకు అవగాహన

మొగల్తూరు: మామిడి తోటల్లో కాయలు కోసిన తరువాత కొమ్మల కత్తిరింపు అనంతరం జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యాన అధికారి కె.ప్రియదర్శిని సూచించారు. రామన్నపాలెంలోని సచివాయలం -1 పరిధిలో రైతు సేవా కేంద్రంలో గురువారం మామిడి రైతుల సమావేశంలో ఆమె మాట్లాడారు. 20, 30 ఏళ్ల వయస్సున్న మామిడి చెట్లకు కొమ్మలు కోసిన తరువాత ఒక్కో చెట్టుకు 200 గ్రాముల యూరియా, 200 గ్రాముల సింగిల్ సూపర్ పాస్ఫేట్ 200 గ్రాములు మ్యూరేట్ ఆఫ్ పొస్ఫేట్‌ను చెట్టు మొదళ్లలో వేయాలన్నారు. రసం పీల్చే పురుగుల నుంచి రక్షణకు క్లోరిపైరిపాస్ 1.5 ఎంఎల్, వేపనూనె 3 ఎంఎల్, జిగురు 0.5 ఎంఎల్ లీటరు న్నర నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు.

పీహెచ్‌సీకి గూడు కరువు

- పదేళ్ల క్రితమే మండలానికి రెండో పీహెచ్‌సీ మంజూరు
- కార్యాలయం లేకుండానే వైద్యులు, సిబ్బంది విధులు
- గ్రామాల్లో తిరుగుతూ వైద్యసేవలందిస్తున్న వైనం

ఆకివీడు: ఆకివీడు మండలానికి రెండో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (కోలోకేటెడ్) మంజూరు అయినప్పటికీ కార్యాలయం లేక సిబ్బంది, వైద్యులు అవస్థలు పడుతున్నారు. పెదకాపవరం గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) గత పదేళ్ల క్రితమే ఏర్పాటు అయింది. దీని ద్వారా కొల్లేరు తీర గ్రామాలకు, మండలంలోని ఇతర గ్రామాలకు వైద్య సేవలందిస్తున్నారు. మండలానికి మరో పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలని ప్రజలు ఎప్పటి నుంచో ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. దీంతో మండలానికి మరో పీహెచ్‌సీ అవసరమని గుర్తించి కోలోకేటెడ్ పీహెచ్‌సీని మంజూరు చేశారు. ఈ పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యుల్ని, ఎంపీహెచ్‌ఎస్ మహిళ, పురుషుడి పోస్టులలో ఇద్దరిని నియమించారు. 104 వాహనం, డ్రైవర్‌ను ఇచ్చారు. ఇద్దరు వైద్యులలో ఒక వైద్యురాలు మెడికల్ లీవ్‌లో ఉండగా ప్రస్తుతం గోవర్ధిని అనే మహిళా వైద్యురాలు సేవలందిస్తున్నారు. ఎంపీహెచ్‌ఎస్ (ఎం) సూపర్‌వైజర్ డిప్యూటేషన్‌పై వెళ్లిపోయారు. ప్రస్తుతం ఎంపీహెచ్‌ఎస్ (ఎఫ్) మహిళా సూపర్‌వైజర్ పనిచేస్తున్నారు. అయితే కోలోకేటెడ్ పీహెచ్‌సీని తమ గ్రామంలో పెట్టాలని అయిభీమవరం వాసులు పట్టుపట్టగా, తమ గ్రామానికి చెందాలని చెరుకుమిల్లి గ్రామస్తులు పట్టుబట్టారు. దీంతో ఏ గ్రామానికి చెందకుండా పీహెచ్‌సీకి కేంద్ర స్థానం లేకుండా పోయింది. నిర్దిష్టమైన కేంద్రం లేకుండానే వైద్యులు, సిబ్బంది ప్రజలకు గ్రామాల్లో వైద్య సేవలందిస్తున్నారు. తాత్కాలికంగా నగర పంచాయతీలోని సీహెచ్‌సీ ఆసుపత్రిలో తలదాచుకుంటున్నారు. కోలోకేటెడ్ పీహెచ్‌సీకి నిర్దిష్టమైన గ్రామం కేంద్రంగా ఉండేందుకు వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న పీ.డీ సుజాత

కాళ్ల: బాల్యవివాహాలను ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఐసీడీఎస్ పీడీ బి.సుజాత రాణి హెచ్చరించారు. కాళ్ల మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్, పంచాయతీ రాజ్, పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులకు, సిబ్బందికి ఒకరోజు పాటు శిక్షణ తరగతులు గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ఆకివీడు ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో పలు అంశాలపై అవగాహన కల్పించారు. డీసీపీఓ ఆర్.రాజేష్ మాట్లాడుతూ బాల్యవివాహాల నిరోధక చట్టం 2006లోని 31, 39 జీఓ విధి విధానాలను వివరించారు. సీడీపీవో వి.వాణి విజయరత్నం మాట్లాడుతూ గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు విధిగా నిర్వహించాలని తెలిపారు. గ్రామ స్థాయిలో చైల్డ్ మ్యారేజ్ ప్రొహిబిషన్ విధి విధానాలను వివరించారు. బాల్యవివాహాలు, మహిళలపై హింస, లింగ వివక్షపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జి.స్వాతి, తహసీల్దార్ నాగార్జున, ఎంఈఓ ఎ.రవీంద్ర, ఈఓఆర్డీ ఎంవీ భాస్కరరావు, సూపర్‌వైజర్లు కె.సూర్యకుమారి, పి.పార్వతి, వీఆర్వోలు, గ్రామ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, పూజారులు, పాస్టర్లు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థినులకు బాసటగా ఉండాలి



విద్యార్థినులతో మాట్లాడుతున్న జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి

భీమవరం: సంక్షేమ వసతి గృహాల్లో ఆశ్రయం పొందుతున్న విద్యార్థినులకు వసతి గృహ అధికారులు బాసటగా నిలవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని రైతు బజార్ వద్ద ఉన్న సోషల్ వెల్ఫేర్ చిల్డ్రన్స్, కళాశాల వసతి గృహాలను జేసీ టి.రాహుల్‌కుమార్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో కలిసి కూర్చుని వారికి వడ్డిస్తున్న పదార్థాలను రుచి చూశారు. బాగా చదువుకోవాలని, విద్య ద్వారానే అన్ని సాధించగలమని తెలిపారు. వసతి ఎలా ఉంది, ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. వసతి గృహ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, అలాగే వంట చేసే ప్రదేశం కూడా శుభ్రంగా ఉండాలని జేసీ హాస్టల్ అధికారులను ఆదేశించారు. సీజనల్ వ్యాధులు రాకుండా తగిన జాగ్రత్తలు విద్యార్థులకు తెలియజేయాలని ఈ సందర్భంగా తెలిపారు. జేసీ వెంట జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శోభారాణి, వసతి గృహ అధికారులు, తదితరులు ఉన్నారు.

రక్తదానంపై అవగాహన పెరగాలి



రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న దృశ్యం

భీమవరం: రక్తదానంపై అవగాహన పెరగాల్సిన అవసరం ఎంతైనా ఉందని భీమవరం మోటార్ సైకిల్ మెకానిక్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు బందెల హనుమంతరావు, ముమ్మన విజయ్‌కుమార్ అన్నారు. గురువారం ఏఎస్ఎన్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరంలో యూనియన్ సభ్యులు రక్తదానం చేసిన సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల పెరుగుతున్న అవసరాలకు సరిపడా రక్తం అందుబాటులో లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారని, దీంతో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. ఏఎస్ఎన్ బ్లడ్ బ్యాంక్ అధినేత అల్లూరి సూర్యనారాయణరాజు మాట్లాడుతూ రక్తదానంపై అనేక అపోహలు ఉన్నాయని, వీటి నివృత్తి కోసం అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. యూనియన్ సభ్యులు హనుమంతురావు, విజయ్‌కుమార్, గద్దె రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు శిక్షణ ప్రారంభం



పాలకోడేరులో శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న మంగపతిరావు

పాలకోడేరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, ఐఎల్ఓ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం పాలకోడేరు మండల మహిళా సమాఖ్య భవనంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు శిక్షణ తరగతులను గురువారం ప్రారంభించారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా పరిశ్రమల అధికారి మంగపతిరావు హాజరై మాట్లాడారు. ఈ శిక్షణలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవసరమైన మెలకువలు, వ్యాపార నిర్వహణ శక్తి సామర్థ్యాలపై, అలాగే మహిళలు వ్యాపారంలో రాణించే అవకాశాలపై, పరిశ్రమల ఏర్పాటుకు కావాల్సిన వివిధ రకాల అనుమతులను వివరించారు. మరో అతిథిగా పాల్గొన్న లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ మాట్లాడుతూ మార్కెట్లో డిమాండ్ ఉన్న వ్యాపార అవకాశాలపై, ప్రాజెక్ట్ రిపోర్ట్ తయారీ, మార్కెట్ మెలకువలు, నిర్వహణ శక్తి సామర్థ్యం, ఖాతా పుస్తకాలు నిర్వహణ, వ్యాపారంలో పాటించాల్సిన నియమ నిబంధనలు, ఉత్పత్తి సామర్థ్యం, సేల్స్, మార్కెటింగ్‌పై వివరించారు. ట్రైనర్స్ హేమాద్రి, హిమబిందు, ఏపీ ఎస్ఎస్‌డీసీ సిబ్బంది, డీఆర్‌డీఏ మండల సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు ప్రశంసనీయం



భీమవరంలో ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం: స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న సేవాకార్యక్రమాలు ప్రశంసనీయమని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. మానవతా సేవా సంస్థ 20వ వార్షికోత్సవం సందర్భంగా పట్టణంలో క్విట్ ఇండియా స్థూపం నుంచి గురువారం చేపట్టిన శాంతి ర్యాలీని కలెక్టర్ నాగరాణి ప్రారంభించి మాట్లాడారు. భీమవరంలో మానవతా సేవా సంస్థ మొక్కలు నాటడం, పేదలకు సహాయం అందించడం వంటి సేవాకార్యక్రమాలు నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. మానవతా సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు పెన్మెత్స మోహన్‌వర్మ, వేమూరి రాంబాబు మాట్లాడుతూ 2003లో 103 మందితో మానవతా సంస్థ ఏర్పాటు చేయగా, ప్రస్తుతం రాష్ట్రంలోని 13 జిల్లాలో 70 వేల మంది సభ్యులతో సేవా కార్యక్రమాలను చేపడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు బుద్దరాజు వెంకటపతిరాజు, కారుమూరి ప్రసాద్, చెరుకువాడ రంగసాయి, అల్లు శ్రీనివాస్, కంతేటి వెంకటరాజు, ఇందుకూరి ప్రసాదరాజు, అరసవల్లి సుబ్రహ్మణ్యం, బొండా సుబ్బారావు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘ కొత్త కార్యవర్గం ప్రమాణ స్వీకారం



ఆర్యవైశ్య సంఘం మండల కార్యవర్గం ప్రమాణ స్వీకారం దృశ్యం

భీమవరం: ఆర్యవైశ్య సంఘం భీమవరం మండల నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం గురువారం ఆర్యవైశ్య వర్తక సంఘ భవనంలో జరిగింది. సంఘం అధ్యక్షుడిగా కంచర్ల వెంకట రమణారావు (కొండ), ప్రధాన కార్యదర్శిగా అనంతపల్లి చలపతి రావు, కోశాధికారిగా చక్కా శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి కనగర్ల కిషోర్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా హాజరైన వబిలిశెట్టి వెంకటేశ్వరరావు, ఓలేటి లక్ష్మణరావు, పరుచూరి నాగేశ్వరరావు, మానేపల్లి నాగన్నబాబు, కారుమూరి సత్యనారాయణ, గునుపూటి తిరుపాల్, చెక్క సుబ్బారావు, పత్రిపాటి శ్రీను మాట్లాడుతూ నూతన కార్యవర్గం సంఘ అభివృద్ధితోపాటు సమాజసేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఓలేటి శ్రీనివాస్ గుప్తా, బంగారు రాము, గూడూరు బాలమురళీకృష్ణ, మానేపల్లి రవి, సకల కుమార్, గమిని పవన్ పాల్గొన్నారు.

మేలైన యాజమాన్యంతో అధిక దిగుబడులు



చెరుకుమిల్లిలో పొలంబడిలో రైతులకు సూచనలిస్తున్న ఏఓ ప్రియాంక

ఆకివీడు: వరి సాగులో యజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారిణి ప్రియాంక అన్నారు. మండలంలోని చెరుకుమిల్లి గ్రామంలో పొలంబడి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి సాగులో ఎరువులు, నీటి యజమాన్య పద్ధతులు కీలకమన్నారు. ఎరువుల యజమాన్య పద్ధతుల్లో ఎంటీయూ 1318 రకం చేలకు 60-40-40 హెక్టారుకు కేజీ చొప్పన, ఇతర రకాల వరి చేలకు 90-60-60 రకం ఎరువులు హెక్టారుకు కేజీ చొప్పన సార్వా సాగులో వేయాలని సూచించారు. పంటలకు డీఏపీ ఎరువును తగ్గించి కాంప్లెక్స్ ఎరువులను వాడాలన్నారు. ఎరువుల సమతుల వినియోగం వల్ల పెట్టుబడి తగ్గుతుందని ప్రియాంక రైతులకు వివరించారు. పెట్టుబడి తగ్గి దిగుబడి పెరిగే విధంగా రైతులు చూసుకోవాలన్నారు. చేలల్లో తడిపొడి నీటిని ఉంచడం, తక్కువ స్థాయిలో నీరు అందజేయడం వల్ల పిలకలు అధికంగా వేసే అవకాశం ఉందని చెప్పారు. కార్యక్రమంలో రైతులు బి.రాంబాబు, ఎన్.కేశవరాజు, వై.వెంకట్, వీఏఏ రాంప్రసాద్, పలువురు రైతులు పాల్గొన్నారు.

కోల్‌కతా ఘటనపై నిరసన ర్యాలీ



వెంపలో నిరసన ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

భీమవరం అర్బన్: కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌ను అత్యాచారం చేసి హత్య చేసిన ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. భీమవరం మండలంలోని వెంప గ్రామంలో సీఐటీయూ సంఘ ఆధ్వర్యంలో గురువారం అంగన్‌వాడీ, ఆశా, పంచాయతీ కార్మికులు, ఆరోగ్య సిబ్బంది ట్రైనీ డాక్టర్ హత్యను ఖండిస్తూ నిరసన ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాసరావు మాట్లాడుతూ డ్యూటీలో ఉన్న ట్రైనీ డాక్టర్‌ను అత్యాచారం చేసి హత్య చేయడం దారుణమన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు గడుస్తున్నా మహిళలు, బాలికలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. నలుగురికి తన వృత్తి ద్వారా ప్రాణం పోసే డాక్టర్‌ను ప్రాణం తీయడం ఆటవిక చర్య అని ఖండించారు. దోషులను వెంటనే శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయుర్వేద డాక్టర్ రామచంద్రరావు, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకురాలు విజయలక్ష్మి, ఆశా జ్యోతి, లిఖిత, సానబోయిన కృష్ణారావు, సత్యనారాయణ, బి చిట్టిమేరి, టి గౌరి, కే పాల్ రాజు, బి. వెంకటలక్ష్మి, బి ప్రసన్న, దిడ్ల సునీత, పోతునీడి లక్ష్మి, నర్సమ్మ, జక్కంశెట్టి రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైద్యురాలిపై అఘాయిత్యాన్ని నిరసిస్తూ ర్యాలీ



భీమవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న కేజీఆర్ఎల్ కళాశాల విద్యార్థులు

భీమవరం: కోల్‌కతాలో వైద్యురాలిపై అఘాత్యానికి నిరసనగా గురువారం కేజీఆర్ఎల్ కళాశాల విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మెంటే హరినాథ్‌బాబు మాట్లాడుతూ రోగులకు ప్రాణంపోసే డాక్టర్‌పై అత్యాచారం, హత్య రాక్షసత్వమని, నేరస్తులను శిక్షించేందుకు తగిన చట్టాలు ఉన్నా తక్షణం చర్యలు తీసుకోకపోతే ఎవరికి రక్షణ ఉండదన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని హరినాథ్‌బాబు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఐ.రామచంద్రమూర్తి, ఇంటర్మీడియట్ కళాశాల ప్రిన్సిపాల్ గంగాధరరావు, పీజీ కళాశాల డైరెక్టర్ తోట రామ్మూర్తి, నాచు శ్రీవల్లి, చెరుకువాడ రంగసాయి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాళ్ల: కాళ్ల సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్లపై చెట్ల కొమ్మలు తొలగించే నిమిత్తం శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని దొడ్డనపుడి గ్రామంలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

భీమవరం మండలంలో..

భీమవరం అర్బన్: భీమవరం మండలంలోని పెదగరువు విద్యుత్ ఉప కేంద్ర పరిధిలో 11 కేవీ హైటెన్షన్ విద్యుత్ లైన్లపై శుక్రవారం చెట్ల కొమ్మలు తొలగింపుతో పాటు వార్షిక మరమ్మతులు నిమిత్తం పలు గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్‌ఖాన్ గురువారం తెలిపారు. దీంతో సబ్‌స్టేషన్ పరిధిలోని చినగరువు, దిరుసుమర్రు, పల్లిపాలెం, తూర్పుగూడెం, శివాలయం సెంటర్ ఏరియాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిచిపోతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉండి మండలంలో..

ఉండి: ఉండి, యండగండి విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో నిర్వహణ పనుల నిమిత్తం సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం ఉదయం 7 గంటలకు మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో భీమవరం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్‌ఖాన్ గురువారం ఒక తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని ఉండి, చిలుకూరు, వెలివర్రు, మహదేవపట్నం, ఎన్నార్పీ అగ్రహారం, చెరుకువాడ, కలిసిపూడి, పెదపుల్లేరు, యండగండి, ఉణుదుర్రు గ్రామాలలో 11 కేవీ ఫీడర్‌లో విద్యుత్ నిలిచిపోతుందని, వినియోగదారులు సహకరించాలని ఈఈ కోరారు.

భీమవరంలో..

భీమవరం: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఏరియాలోని 33/11 కేవీ ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ లైన్లపై చెట్ల కొమ్మలు తొలగించే నిమిత్తం శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్‌ఖాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని సుంకర పద్దయ్యవీధి, బ్యాంక్ కాలనీ, రెడ్డి కాలనీ, చినపేట, పెద్ద ఆంజనేయస్వామి టెంపుల్ ఏరియా, భీమేశ్వరస్వామి టెంపుల్ ఏరియా, లలిత జ్యూయలరీ ఏరియాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఈఈ కోరారు.

ఆకివీడు ఎస్సైగా నాగరాజు

ఆకివీడు: ఆకివీడు ఎస్సైగా హనుమంతు నాగరాజు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల అనంతరం బదిలీల్లో భాగంగా ఏలూరు నుంచి ఇక్కడకు బదిలీ అయ్యారు. ఇప్పటివరకు ఇక్కడ ఎస్సైగా పనిచేసిన బి.నాగబాబు వీరవాసరం పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు.

ఉండిలో భారీ వర్షం

ఉండి: మండల వ్యాప్తంగా గురువారం మధ్యాహ్నం వర్షం దంచికొట్టింది. సుమారు గంట పైబడి భారీ వర్షం కురియడంతో ఒక్కసారిగా పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. సాయంత్రానికి వర్షపునీరు కూడా డ్రెయిన్ల ద్వారా బయటకు మళ్లడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నారుమడులు, నాట్లు మునిగి దెబ్బతినడంతో రైతులు నష్టపోయారు. ప్రస్తుతం మళ్లీ నాట్లు వేసుకున్న తరుణంలో గురువారం కురిసిన భారీ వర్షానికి రైతులు ఆందోళనకు గురయ్యారు. అయితే మధ్యాహ్నానికే వర్షం తగ్గిపోవడంతో రైతులు ఊపిరిపీల్చుకున్నారు.

నేడు గ్రామ సభలు

ఉండి: మండలంలోని 19 గ్రామ పంచాయితీల్లో శుక్రవారం గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎస్.రవీంద్ర చెప్పారు. గురువారం ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలు-స్వర్ణ గ్రామ పంచాయతీలు అనే నినాదంతో నిర్వహిస్తున్న ఈ గ్రామ సభలు ఉదయం 10 గంటలకు, మధ్యాహ్నం 12 గంటలకు, సాయంత్రం 2 గంటలకు ఆయా గ్రామాల్లో ప్రారంభమవుతాయని తెలిపారు. మండలస్థాయిలో ఎంపీడీవో, తహసీల్దార్‌తో పాటుగా వివిధ శాఖల అధికారులు కూడా పాల్గొంటారని ఎంపీడీవో తెలిపారు.

వికలాంగుడికి ఆర్థిక సాయం

భీమవరం: వికలాంగుడైన బందారు సుబ్బారావుకు సినీ నటుడు చిరంజీవి అభిమానులు రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని స్థానిక ఎమ్మెల్యే అంజిబాబు చేతులమీదుగా గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి అభిమానులు పాల్గొన్నారు.